క్లుప్తంగా

మరమ్మతు పనులు ప్రారంభం



మాగనూర్: మండలంలోని వడ్వాట్ గేట్ నుంచి మందిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. వర్షాల కారణంగా రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రజల ఇబ్బందులను గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి మరమ్మతు చేపట్టాలని ఆదేశించడంతో పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. వడ్వాట్–మందిపల్లి, వర్కూర్–నేరడగం గ్రామాలకు డబుల్ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. వడ్వాట్ నుంచి మందిపల్లి గ్రామానికి ప్రస్తుతానికి గుంతలను పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు తొలగించి వేసవి కాలం నాటికి బీటీ రోడ్డు పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాంరెడ్డి, వడ్వాట్ రవీందర్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనాల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి అడిగిన వెంటనే మంత్రి వాకిటి శ్రీహరి రూ.12 లక్షలతో పాటు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలను మంజూరు చేశారన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టబడి ఉందని, కాంగ్రెస్ ప్రజాపాలనలో పల్లెలు మరింత అభివృద్ధి చెందడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మారుతి, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ఆదర్శంగా నిలుపుదాం



మరికల్: జాతీయ స్థాయిలో ఏబీఆర్ఎస్‌యం పిలుపు మేరకు తపస్ ఆధ్వర్యంలో సోమవారం కన్మనూర్ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులతో 'మన పాఠశాల–మన ఆత్మగౌరవం' ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తపస్ సంఘం మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ మన పాఠశాలను ఆదర్శవంతంగా తయారు చేయడంలో అందరం కలిసి కృషి చేద్దామన్నారు. అలాగే పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల బాధ్యతలను గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాల నారాయణ, గోపాల్‌రెడ్డి, చంద్ర శేఖరయ్య, వెంకటరెడ్డి, హన్మంతు, శివ చరణ్, సుమత, సుహాసిని, కళావతి పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి



నారాయణపేట: జిల్లాలో వెంటనే అకాడమిక్ విద్యా వలంటీర్లను నియమించాలని సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి నారాయణపేట పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వై జనార్దన్ రెడ్డి విన్నవించారు. జిల్లాలో ప్రత్యేకంగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని, ఇటీవల జరిగిన పదోన్నతులలో దాదాపు 80 మంది ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు పదోన్నతిపై వెళ్లడంతో 250 మంది ఉపాధ్యాయుల అవసరముందన్నారు. ఇందుకు స్పందించిన తెలంగాణ విద్య కమిషన్ చైర్మన్ జిల్లా విద్యాశాఖ నుంచి వివరాలు తెప్పించుకొని అకాడమిక్ ఇన్‌స్పెక్టర్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా ఎల్‌ఐసీ వార్షికోత్సవం

నారాయణపేట: ఎల్ఐసీ 69వ వార్షికోత్సవ సంబరాలు సోమవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రమేశ్ మాట్లాడుతూ వారం పాటు జరిగే బీమా వారోత్సవాల్లో కస్టమర్లకి మరింత చేరువగా సేవలు అందిస్తామన్నారు. 100% డెత్ క్లైమ్ సెటిల్మెంట్ వల్ల ఎల్ఐసీపై ప్రజల విశ్వాసం మరింత బలపడిందన్నారు. ఆఫీస్ సిబ్బంది సత్యప్రభ, ఏజెంట్లు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లు.. తప్పని అవస్థలు



ఊట్కూర్‌లోని వెంకటేశ్వర నగర్‌లో కూలిపోయిన కల్వర్టు

- గుంతమయంగా తయారైన రోడ్లు
- మురుగుకాల్వలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ఊట్కూర్: ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో చేపట్టకపోడం, అధికారుల ప్రత్యేక పాలనతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. కనీస సౌకర్యాలు అయిన రోడ్లు, మురుగు కాల్వలు కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన ఊట్కూర్‌లో మొత్తం 16 వార్డులు ఉన్నాయి. సుమారు 17 వేల మంది జనాభా ఉన్నారు. రెండేళ్లుగా భారీ వర్షాలు కురువడంతో రోడ్లు గుంతమయంగా తయారయ్యాయి. మండలంలోని ఈశ్వర్ మందిర్, పాతపేట, కుర్వగేరి తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వలపై స్లాబ్‌లు, పైపులు పగిలిపోవడంతో ప్రజలు నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఏ ప్రమాదం ముంచుకొస్తుందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కార్గిల్ నగర్, మెయిన్ బజార్, గద్వాల్ గేరి, గుంతల్ గేరి, పాతపేట, వేంకటేశ్వర నగర్, శ్రీరాంనగర్ వీధుల్లో సీసీ రోడ్లు లేక రాకపోకలకు నరకయాతన పడాల్సి



గద్వాల్ వీధిలో దెబ్బతిన్న రోడ్డు

వస్తుందని ప్రజలు వాపోతున్నారు. గతంలో సీసీ రోడ్లపై మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు తవ్విన గుంతలను అలాగే వదిలేయడంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. కార్గిల్ నగర్‌లో రోడ్డు మధ్యలో బండరాయి ఉండడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లలేక ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బండరాయిని పగులగొట్టి రోడ్డును వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించాలని కోరుతున్నారు.

కలెక్టర్‌కు అఖిలపక్షం నాయకుల వినతి

జిల్లా కేంద్రం నారాయణపేటలో ప్రజావాణి కార్యాక్రమంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మండల కేంద్రంలోని సమస్యలపై అఖిలపక్షం నాయకులు వినతిపత్రం సైతం అధించారు. ఏళ్లుగా గ్రామంలో అంతర్గత రోడ్లు మరమ్మతుకు నోచుకోకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాపోయారు.

సీసీ రోడ్లు వేయాలి..

గ్రామంలో సీసీ రోడ్లు లేకపోడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మురుగు కాల్వలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో మురుగు రోడ్లపైనే పారుతుంది. గతంలో సీసీ రోడ్లను పగలగొట్టి మిషన్ భగీరథ పైప్‌లేన్ వేసి మళ్లీ రోడ్డు వేయకపోడంతో రోడ్లు గుంతలమయంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్లు వేయిస్తే బాగుంటుంది.
–కొండన్ గోపాల్, ఊట్కూర్

రోడ్డు వెడల్పు చేయాలి..

కార్గిల్ నగర్‌లో రోడ్డు మధ్యలో బండరాయి ఉండడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు వెడల్పు చేయాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి బండరాయిని తొలగించి రోడ్డు వెడల్పు చేయాలి.
–అబ్దుల్ రహీం, ఊట్కూర్

నివేదిక పంపించాం..

గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో సమస్యలు జఠిలంగా మారాయి. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులకు లేకుండా చూస్తాం.
–శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శి, ఊట్కూర్

ఘనంగా గణేశ్ నిమజ్జనం



మాద్వార్‌లో విగ్రహాన్ని తీసుకెళ్తున్న చిన్నారులు



పూజలు చేస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్



తిప్పరాస్‌పల్లిలో నిమజ్జనంలో పాల్గొన్న నాయకులు

మక్తల్: మండలంలోని మాద్వార్, సోమేశ్వర్‌బండ గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ఘనంగా జరుపుకొన్నారు. 5 రోజుల ప్రత్యేక పూజల అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకొని విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్లారు. నిమజ్జనానికి ముందు లడ్డు వేలం వేయగా కొంతమంది వేలం పాడి దక్కించుకున్నారు. నిమజ్జనంలో విద్యార్థులు చేసిన నృత్యాలు, దాండియా ఆటలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర

ఊట్కూరు: మండలంలోని తిప్పరాస్‌పల్లి, పెద్ద పొర్ల గ్రామాలలో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో వినాయకుడి శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కోలాటం, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతూ యువతి యువకులు శోభాయాత్రలో పాల్గొన్నారు.

కొనసాగిన మహాగణపతి ఉత్సవాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక శక్తి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మహా గణపతి బ్రహ్మోత్సవాలు సోమవారం 6వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం భాద్రపద శుద్ధ నవమిని పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు విశేష పంచామృత అభిషేకం, అశ్వర్థ పత్రార్చన, లక్ష్మీ గణపతి హవనములను ప్రముఖ కృష్ణ యజుర్వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

మరికల్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి సోమవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రత్యేక పూజలు

మద్దూరు: పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రతిష్ఠించిన 35 అడుగుల భారీ వినాయకుడి దగ్గర ఎస్పీ యేగేష్‌గౌతమ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బాంబు స్క్వాడ్ తనిఖీలు

మక్తల్: మండపంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల వద్ద బాంబు స్క్వాడ్ బృందం సోమవారం తనిఖీలు చేపట్టింది. ఎస్పీ గౌతమ్ యోగేష్ ఆదేశాల మేరకు గణేశ్ ఉత్సవాల సందర్భంగా మక్తల్ సీఐ రాంలాల్, మక్తల్ ఏఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో మండపాల దగ్గర తనిఖీ చేశారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లిలో వినాయక నిమజ్జనంలో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వినాయక శోభాయాత్రలో రాంచందర్‌గౌడ్, శ్రీనివాస్ తమ వాహనం ముందు వెళ్లాలంటే తమ వాహనం వెళ్లాలని వాదనకు దిగారు. ఈ క్రమంలో గొడవ మొదలవడంతో ఒకరికొకరు కొట్టుకున్నారు. పోలీసుల జోక్యం చేసుకొని ఇరువురిని చెదరగొట్టారు.

పీఏసీఎస్ ద్వారా యూరియా సరఫరా చేయాలి



ఊట్కూరు: సీపీఎస్ ప్రాథమిక వ్యవసాయ సంఘం ద్వారా యూరియాను సరఫరా చేయాలని మండల రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కార్యదర్శి హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. సకాలంలో యూరియా దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆరోపించారు. పీపీఎస్ బ్యాంకు అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా రైతులకు యూరియాను సరఫరా చేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు కురుమయ్య, లింగప్ప, తిమ్మయ్య, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలి

నారాయణపేట: మండలంలోని కోటకొండ గ్రామంలో ప్రతిష్ఠించిన భారీ విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ కలిసి వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలో 25 భారీ విగ్రహాలు ప్రతిష్ఠించామని, వాటి నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు కలగకుండా క్రేన్ సౌకర్యం కల్పించాలని కోరారు.అదే విధంగా గ్రామం నుంచి చెరువు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారిందని మట్టి వేసి తాత్కాలికంగా అయిన రోడ్డును బాగు చేయాలని కోరారు. కలిసిన వారిలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, గణేష్ ఉత్సవ సమితి నాయకులు కాశీనాథ్, తీగలి రాజు ఉన్నారు.

బహుమతుల ప్రదానం

ఊట్కూరు: ఊట్కూరులోని భవానిమందిర్‌లో ఆదివారం రాత్రి ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భజన పోటీలలో గెలుపొందిన వారికి సోమవారం బహుమతుల ప్రదానం చేశారు. భజన పోటీలో 12 భజన మండలీలు పాల్గొన్నాయి. వీరిలో పెద్దజట్రం గ్రామానికి చెందిన వీరలింగేశ్వర భజనమండలి ప్రథమ బహుమతి రూ.11 వేలు, పెద్దపొర్లకు చెందిన శ్రీరామ్ భజనమండలి ద్వితీయ బహుమతి కింద రూ. 8 వేలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్ కుమార్, లక్ష్మారెడ్డి, నర్సింగప్ప, భరత్, శంకర్, హనుమంతు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కృష్ణా: ఆర్థికంగా వెనుకబడిన మహిళలను ఆదుకోవడానికి బీటీఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని ఫౌండర్ తిమ్మప్ప అన్నారు. సోమవారం మండలంలోని ఐదుగురి మహిళలకు గుడెబల్లూర్ గ్రామంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద రైతులకు, విద్యార్థులకు, మహిళలకు చేయూతను ఇచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో చింతన్‌పల్లి శివప్రసాద్‌రెడ్డి, అంజిలయ్యగౌడ్, కృష్ణా, వీఆర్ఎల్ వెంకటేష్, నింగు, సోఫి తదితరులు పాల్గొన్నారు.



యూరియా పేరుతో రైతులను రెచ్చగొట్టకండి

మక్తల్: యూరియా పేరుతో రైతులను రెచ్చగొట్టకండని, రైతులందరికీ యూరియా పంపిణీ చేస్తామని మక్తల్ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కంటె కాంగ్రెస్ హయాంలోనే రైతులకు అధిక యూరియా పంపిణీ చేశామన్నారు. రైతులను అనవసరంగా గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో 2021లో 12,532 మెట్రిక్ టన్నులు, 2022లో 14,638 మెట్రిక్ టన్నులు, 2023లో 16.324 మెట్రిక్ టన్నులు యూరియాను అందించారన్నారు. అదే కాంగ్రెస్ పాలనలో 2024లో రైతులకు 16,457 మెట్రిక్ టన్నులు అందించగా 2025లో ఇప్పటి వరకు 15,056 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. బీఆర్ఎస్ చేసింది ఏమీలేదని, ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు రంజిత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఫయాజ్, రాజేందర్, కట్టసురేశ్, కట్టవెంకటేశ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాగునీటి ఎద్దడి తీర్చండి

మక్తల్: మక్తల్ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడిని తీర్చాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 స్కీం కింద పట్టణానికి రూ.15.20 కోట్లతో 14 లక్షల కెపాసిటీ గల ట్యాంకులను మంజూరు చేసినట్లు తెలిపారు. అయినా ఇంత వరకు ట్యాంకు నిర్మాణానికి స్థల సేకరణ చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మక్తల్‌లో మున్సిపాలిటీలో గత నాలుగు నెలల నుంచి 15 నుంచి 20 రోజులకు ఒకసారి నీళ్లు విడుదల చేస్తున్నారన్నారు. మిషన్ భగీరథ, మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు తాగునీటి కష్టాలు పడుతున్నారన్నారు. సమస్యను పది రోజుల్లో పరిష్కరించకపోతే తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ద్యావరింటి నర్సింహారెడ్డి, చీరాల సత్యనారాయణ, అనంపల్లి కొండయ్య, నరేందర్, కుర్వలింగం, శివరాములు, అంజనేయులు, శ్రీనివాసులు, కతలప్ప, బుగ్గప్ప సుకనక్య చంద్రశేకర్, అంజన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య

గుంతల పూడ్చివేతను అడ్డుకున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రంలోని పలు రోడ్లు గుంతలమయంగా మారడంతో ధన్వాడ యువత సొంతంగా గుంతలను పూడ్చడానికి చర్యలు చేపట్టింది. గుంతలను పూడ్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో యువత చందాలు సేకరించి ఆదివారం గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. అయితే ఎమ్మెల్యే, ఎంపీ సొంత గ్రామంలో దాతాల సహకారంతో రోడ్లకు మరమ్మతు చేస్తుండడంతో మింగుడు పడని నాయకులు మోరం వేయకుండా అడ్డుకున్నారు. దీంతో ప్రజా సమస్యలను వారు పరిష్కరించరు.. పరిష్కరించే వారిని అడ్డుకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులను పూర్తి చేయడానికి సహకరించకపోతే రాస్తారోకో చేపడతామని ధన్వాడ యువత హెచ్చరించింది.



నిలిచిపోయిన రోడ్డు చదును పనులు

నర్వ సంత స్థలం మార్పు

నర్వ: మండల కేంద్రంలో నిర్వహించే వారాంతపు సంత స్థలాన్ని మారుస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సభ తీర్మానం మేరకు అంబేడ్కర్ చౌరస్తా నుంచి కృష్ణుని దేవాలయం కమాన్ వరకు సంతను మార్చినట్లు తెలిపారు. ప్రతి వారం నిర్వహించే సంత గ్రామంలోని బీటీ రహదారిపై నిర్వహిస్తుండడంతో అంబులెన్స్ , పోలీస్, ఫైర్ లాంటి అత్యవసర వాహనాలకు ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో సంతను మార్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

కరెంట్ కోతలను నివారించండి

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో విద్యుత్ కోతల కారణంగా గ్రామంలో చీకట్లు కమ్ముకున్నాయి. గ్రామానికి కరెంట్ సరఫరా చేసే రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి కాలిపోయి రెండు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతు చేయకపోవడంతో పగలు, రాత్రి తేడా లేకుండా అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయకపోవడంతో ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడు పడడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంట్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

కృష్ణా: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటిల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వర్షాల మూలంగా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, రోడ్లు, చెరువులు దెబ్బతిన్నాయని, తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఖానాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించండి



నారాయణపేట: ఉపాధిహామీ పథకంలో కూలీలకు డబ్బులు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడుతున్న ఖానాపూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏడాదిలో నాలుగు వారాలే పని చేయించుకొని వాటికి సంబంధించిన డబ్బులు కూలీల ఖాతాల్లో వేయకుండా తనకు కావాల్సిన వారి ఖాతాల్లో వేయించుకొని డబ్బులు స్వాహా చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి, బీపీఎం సైతం తనకే మద్దతు తెలుపుతున్నారని విచారణ చేపట్టి ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

చెస్ బోర్డుల పంపిణీ

మాగనూర్: పాలమూరు ఎన్నారై ఫోరమ్ చెస్ నెట్‌వర్క్‌తో కలిసి చెస్ క్రీడను ప్రోత్సహించేలా చెస్ బోర్డుల పంపిణీ చేయడం గొప్ప విషయమని మాగనూర్ ఎంఈవో మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల, మాగనూర్ పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా చెస్ బోర్డులు పంపిణీ చేయడాన్ని అభినందించారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం



మరికల్: మండల కేంద్రంలోని సంతా బజార్‌లో ఎమ్మెల్యే నిధుల కింద ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్లను సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరన్న ప్రారంభించారు. ఒక్కసారిగా లైట్ల వెలుతురు రావడంతో వ్యాపారులు, వినియోగదారులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఎంపీ నిధుల కింద ఇబ్రహీంపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన లైట్లను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరీష్, కృష్ణయ్య, చెన్నయ్య, రాములు, ఆనంద్‌కుమార్, రామకృష్ణారెడ్డి,రఘు, రామకృష్ణ, రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ.. అక్రమాలపై జరిమానా

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.4.73 కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సోమవారం తనిఖీ బహిరంగ సభను ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప సమక్షంలో విజిలెన్స్ పీఈ రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించి బాధ్యులపై రూ.1.71లక్షల జరిమానా విధించారు. తోటల సాగులో మొక్కలు లేకపోయిన బిల్లులు రికార్డు చేయడం, మస్టర్‌లో సంతకాలు లేకుండా కూలీ డబ్బులు చెల్లించడం, పని కొలతల్లో తేడాలు తదితర వాటిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు. ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎస్ఆర్‌పీ రాఘవులు, ఏపీఓ జయమ్మ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి



పేటలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు



మరికల్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట: ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని స్థానిక అంబేడ్కర్ చౌరస్తా దగ్గర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆ సంఘం బాధ్యులు వెంకటస్వామి, రెడ్డప్ప, హైమావతి ఉపాధ్యాయుల పాలిటా శాపంగా మారిన సీపీఎస్ రద్దు చేయాలని కలెక్టరేట్‌లో ఏఓకు విన్నతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు సూర్యచంద్ర, వెంకటప్ప, రాఘవేంద్ర చారి, రాజేష్, గోవిందు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

నారాయణపేట టౌన్: దామరగిద్ద మండలంలోని ఎంపీపీఎస్ బాపన్‌పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బ్లాక్ టీ షర్ట్స్ ధరించి నిరసన

మాగనూర్: మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు బ్లాక్ టీ షర్ట్స్ ధరించి నిరసన తెలిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో నిర్వహించే మహా ధర్నాకు బయలుదేరి వెళ్లారు.

ఓపీఎస్ అమలు చేయాలి

మరికల్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరుతూ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఉపాధ్యాయులు తపస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఉపాధ్యాయులు

కృష్ణా: సీపీఎస్ విధానం రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి మండలంలోని టీఆర్‌టీయూ ఉపాధ్యాయులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.